క్లుప్తంగా

నేడు నేత్ర వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో యస్ సొసైటీ సహకారంతో కురుపాం మండలం మూలిగూడ జంక్షన్‌లో శుక్రవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి సీఏఆర్ఆర్ మేనేజర్ యు.రమాదేవి గురువారం తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి ఎంపికలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్) నియోజకవర్గ స్థాయి ఎంపికలు శుక్రవారం నుంచి కురుపాం సాయిరాం గుడి ఎదురుగా ఉన్న మైదానంలో నిర్వహించనున్నట్టు ఎస్‌జీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఎం.మురళీకృష్ణ, పీడీ ఎస్‌ఏ కార్యదర్శి పి.చంద్రమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల అండర్ 14, అండర్ 17 గేమ్స్ అండ్ స్పోర్ట్ ఎంపికలు 20వ తేదీన, బాలుర ఎంపికలు 21వ తేదీన నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం

గరుగుబిల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు పి.అశోక్, పి.సురేష్ తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టి.రాము తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ




విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తదితరులు

కొమరాడ: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులో డ్రాయింగ్ లోవర్ విభాగంలో కొమరాడ మండలం గిరిజన సంక్షేమ గురుకుల బాలురు పాఠశాల విద్యార్థులు టి.రాంబాబు ప్రథమ శ్రేణిలో, డి.గోవర్ధన్, ఎ.వినోద్‌కుమార్, హెచ్ ధనుంజయ, హెచ్.కిరణ్, ఎస్.వంశీవర్ధన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఉపాధ్యాయుడు కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వ్యవసాయంలో శాస్త్రవేత్తలు అందించే సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ అన్నారు. కురుపాం మండలం రస్తాకుంటుబాయి కేవీకేలో మెరకముడిదాం మండలంలోని సోమలింగపురం గ్రామంలోని రైతులకు నూనెగింజలు, అపరాల్లో సామూహికం ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల ద్వారా మినుములు, వేరుశనగలో అధిక దిగుబడి ఇచ్చే రకాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మాట్లాడుతూ మినుములలో ఎల్‌బిజి-884, ఎల్‌బిజి-904 అనే రకాలను, వేరుశనగలో టీసీజీఎస్-1694 రకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ పంట సాగులో శాస్త్రవేత్తలు తెలిపిన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని రైతలకు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్రవంతి, శ్రీనివాసరాజు, విహారి, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

డీ పట్టా భూములపై సర్వే చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన డీ పట్టా భూములను సర్వే చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పేదలకు ఇచ్చిన డీ పట్టా భూములున్నాయా... విక్రయాలు జరిగాయా.. లేదా అన్న వివరాలు సేకరించాలన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

గరుగుబిల్లి: బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపడుతున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాల/కళాశాలను గురువారం సందర్శించి విద్యార్థుల ఆరోగ్య వివరాలకు సంబంధించిన రికార్డులు, సిక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గురువారం విఫ్స్ ప్రోగ్రాం సందర్భంగా విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, డయేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



పాలకొండ : ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పాలకొండ : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండాపురంలో పరిసరాల పరిశుభ్రతపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. చెత్తను కాలువల్లో వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం..

పాలకొండ రూరల్: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ముందుకెళ్లాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనలతో అమలు చేస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, ర్యాలీల్లో ఆమె పాల్గొన్నారు. యరకారాయపురంలో సర్పంచ్ శ్రీనివాసరావు, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం వాసుదేవరావు నేతృత్వంలో విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిడగంటి గణపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: యరకారాయపురంలో పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు చేస్తున్న విద్యార్థులు

పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యత..

వీరఘట్టం: పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యతని అని ఎంపీడీఓ వై.వెంకటరమణ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ ఆర్.ఆనందరావుతో కలసి స్థానిక రెగ్యులర్ పాఠశాలను సందర్శించారు. పారిశుధ్య పరిరక్షణపై విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. అలాగే వీరఘట్టం మేజర్ పంచాయతీలో ఈఓ రవి ఆధ్వర్యంలో పారిశుధ్య పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.



వీరఘట్టం: అవగాహన ర్యాలీ చేస్తున్న ఈఓ, పారిశుధ్య కార్మికులు,సచివాలయ సిబ్బంది

బదిలీలకు ఇది సమయం కాదు..

- వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు సింహాచలం



మీడియాతో మాట్లాడుతున్న వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు మరడ సింహాచలం

వీరఘట్టం: ఉద్యోగుల బదిలీలకు ఇది సరైన సమయం కాదని పార్వతీపురం మన్యం జిల్లా వీఆర్‌ఓల సంఘ అధ్యక్షుడు మరడ సింహాచలం అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ, వీఆర్‌ఓల బదిలీలపై ఇంత వరకు స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మొదట ఈనెల 15న బదిలీలు చేపడతామన్నారు.. ఆ తర్వాత 22కు మార్చారు. అయినప్పటికీ బదిలీలపై స్పష్టత లేదన్నారు. ఈ పరిస్థితుల్లో బదిలీలు చేపడితే పిల్లల చదువులకు ఇబ్బందులేర్పడతాయని తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఆయనతో పాటు వీఆర్‌ఓలు జి.సురేష్‌కుమార్, జి.అప్పలనాయుడు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భామిని: మండలంలోని కొరమ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొరమ - భామిని గ్రామాల మధ్య విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలకొండ రూరల్: పట్టణంలో విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే. మూర్తి తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మండలంలోని గోపాలపురం, యరకారాయపురం, చిన్న, గొట్ట మంగళాపురాలు, చిన్న కోటిపల్లి, అంపిలి, తంపటాపల్లి, వీపీ.రాజుపేట, పరశురాంపురం, సింగన్నవలస, వెలగవాడ, లుంబూరు నుంచి విజయరాంపురం, టౌన్ నుంచి తుమరాడ వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గరుగుబిల్లి: విద్యుత్ మరమ్మతుల క్రమంలో మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గొట్టివలస, మరుపెంట, ఉద్దవోలు, చినగుడబ తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఆ శాఖ ఏఈ బి.శంకరరావు గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



అటవీ సిబ్బందికి సూచనలిస్తున్న సబ్ డీఎఫ్‌ఓ సంజయ్

గుమ్మలక్ష్మీపురం: కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సబ్ డీఎఫ్‌ఓ సంజయ్ అటవీ శాఖ సిబ్బందితో అన్నారు. మండలంలోని ఎస్‌కేపాడు, పి.ఆమిటి గ్రామ పరిసరాల్లో గురువారం చేపట్టిన టేకు తదితర మొక్కల ప్లాంటేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యల గూర్చి ఆరా తీశారు. అడవుల సంరక్షణకు నిత్యం కృషి చేయాలని, చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణాను నివారించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట కురుపాం రేంజర్ మణికంఠేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్ శాస్త్రి, బీట్ ఆఫీసర్ ఎస్.రామారావు తదితరులున్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: బాల్య వివాహాలను ప్రోత్సహించడం, చేయడం చట్టపరంగా నేరమని స్థానిక ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రాంగణంలో సురక్షిత గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా మహిళ వెల్ఫేర్ సొసైటీ, రెడ్ అలర్ట్ అండ్ మైహోయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను ధైర్యంగా ఎదుర్కొవాలన్నారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో కేసులను నమోదు చేస్తామన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ పట్ల విద్యార్థినులు అవగాహన కలిగి వుండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఎన్‌జీఓ అరుణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



మాట్లాడుతున్న సీడీపీఓ శాంతిభవానీ

భామిని: గర్భిణులు, బాలింతలు క్రమంతప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ శాంతిభవానీ అన్నారు. బొడ్డగూడ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందుబాటులోని ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, పాలు, బెల్లం వంటి పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బీపీసీ వరలక్ష్మి, ఎస్‌ఓలు జ్యోతిలక్ష్మి, సబితా పట్నాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులున్నారు.

అద్భుతాల సృష్టికర్త విశ్వకర్మ



పాలకొండ రూరల్: మద్విరాట్ విశ్వకర్మ ఈ సృష్టిలో అద్భుత నిర్మాణాలు చేపట్టారని విశ్వబ్రాహ్మణ సేవా సంఘ నాయకుడు టీకే ప్రసాదరావు అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ మండపంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, నాగరికతకు మూలపురుషుడు విశ్వకర్మ అని కొనియాడారు.

కిరాణా దుకాణాలపై అధికారుల దాడులు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలోని పలు కిరాణా దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, తూనికలు - కొలతల అధికారులు, ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు గురువారం సంయుక్తంగా దాడులు చేశారు. ఓ షాపులో మీరజ్ ఖైనీతో పాటు కొన్ని డ్రింక్స్, ఇతర వస్తువులపై ఎటువంటి తయారీ తేదీగాని, ధరల వివరాలు గాని లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం మన్యం జిల్లా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ రత్నరాజు తెలిపారు.

అలాగే అన్ బ్రాండెడ్ డ్రింక్స్, ఇతర సామగ్రిపై కూడా తయారీ తేదీ లేకపోవడంతో శాంపిల్స్ తీసుకున్నామని ఫుడ్ అండ్ సేఫ్టీ జిల్లా ఇన్‌స్పెక్టర్ రమణయ్య తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సతీష్‌కుమార్, ఎస్సై బి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక తిరువీధి

పాలకొండ రూరల్: పట్టణంలోని గొల్లవీధి శ్రీకృష్ణ యువత నేతృత్వంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. స్వామివారి తిరువీధి కార్యక్రమం, నిమజ్జనోత్సవాన్ని భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు స్వామి వారి లడ్డూ వేలం పాట నిర్వహించగా.. పట్టణానికి చెందిన పట్టా సాయికుమార్ రూ.50 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జి.సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

- రూ. 50 వేలకు లడ్డూ..

భామిని: మండలంలోని సొలికిరి వినాయక మండపం వద్ద గురువారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన కొత్తకోట చౌదరినాయుడు రూ. 50 వేలకు లడ్డూ సొంతం చేసుకున్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు



నాగావళి నదీ తీరంలో పైప్‌లైన్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: నాగావళి నదీ తీరం నుంచి పట్టణంలోని వీవర్స్ కాలనీలోగల రక్షిత పథకానికి నీటి సరఫరా చేసే పైప్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంత ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నట్లు కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు తెలిపారు.

భద్రగిరి గురుకుల విద్యాలయాల్ని సందర్శించిన ఏఎస్పీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్, కళాశాలను పార్వతీపురం ఏఎస్పీ అంకిత మహావీర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థినిలతో మాట్లాడారు. చదువులో ఉన్నతంగా రాణించాలని, చెడు అలవాట్లకు గురికావొద్దంటూ సూచించారు. ఆమె వెంట సీఐ బి.హరి, ఎస్‌ఐ బి.శివప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ కె.సురేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.భారతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

'రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి'

పాలకొండ: రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వినతులు స్వీకరించాలన్నారు. ఎవరైనా ఇసుక, కంకర తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నేడు నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

సీతంపేట: పాలకొండ నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడలు స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించనున్నట్లు క్రీడా పర్యవేక్షణాధికారి జాకాబ్ దయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు మండలాల నుంచి మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను మాత్రమే వ్యాయామ ఉపాధ్యాయులు తీసుకురావాలని పేర్కొన్నారు. భోజన సదుపాయం ఉంటుందన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

గరుగుబిల్లి: వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని రావివలసలోని యంగ్‌స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో రావివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు క్విజ్, డిబేట్, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు హెచ్ఎం శ్రీనివాసరావు బహుమతులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, యంగ్‌స్టార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వట్టిగెడ్డ భూములకు సాగునీరేదీ..!



అర్నాడ వద్ద వరి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జియ్యమ్మవలస: వట్టిగెడ్డ దిగువున ఉన్న పంట పొలాలకు సాగు నీరు అందక ఎండిపోతున్నాయని సీపీఎం నాయకుడు కొల్లి గంగునాయుడు అన్నారు. వట్టిగెడ్డ దిగువున ఉన్న బొడ్డవలస, తుమ్మిగూడ, అర్నాడ గిరిజన గ్రామాలతో పాటు ఇటిక, గెడ్డతిరువాడ పంట పొలాలు గురువారం పరిశీలించామని అన్ని చోట్ల పొలాలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. వట్టిగెడ్డ నుంచి 17 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. దిగువ ఆయకట్టుకు నీరు అందకపోవడానికి ప్రధాన కారణం కాలువలు మరమ్మతులు సక్రమంగా చేయకపోవడమేనని తెలిపారు. వారం రోజుల్లో నీరు పంట పొలాలకు అందకుంటే 500 ఎకరాల్లో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. ఆయన వెంట సీపీఎం నాయకుడు సీతారాం తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పెద్దూరులో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

గరుగుబిల్లి: రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయడం వల్ల వ్యక్తిగత డేటా సైబర్ నేరగాళ్లకు చేరుతుందని, తద్వారా బ్యాంకుల్లో నగదు ఖాళీ అవుతుందన్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. సిబ్బంది శంకర్, ఉమామహేశ్వరరావు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు



సీఐని అభినందిస్తున్న ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ఎంపీపీ కుంబురుక దీనమయ్య ఆధ్వర్యంలో ఎల్విన్‌పేట సీఐ బి.హరిని గురువారం ఎల్విన్‌పేట సర్కిల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సీఐగా ఇటీవలే పదవీ బాధ్యతలు చేపట్టడంతో ఆయన్ను కలిసిన ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా తామంతా కృషి చేస్తున్నామని, పోలీస్‌ల సహకారం కూడా అందివ్వాలని కోరారు. సీఐని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోరిసెట్టి గిరిబాబు, నిమ్మక కృష్ణ, పసుపురెడ్డి మహేష్, గుంపస్వామి, కె.వెంకటరావు, తిరుపతిరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.గౌరీశంకరరావు పలువురు సర్పంచ్‌లు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని లక్కాయిగూడలో ప్రకృతి వ్యవసాయంపై వెలుగు ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్లు ఎ.చిరంజీవి, ఆనందరావు మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులు, ద్రవ, ఘన జీవామృతాలను వినియోగించడం వల్ల భూసారం పెరిగి దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. అలాగే లైన్‌సోయింగ్, కాలిబాటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బంబడుగూడ, చాపరాయిగూడ, లక్కాయిగూడ గ్రామాల నుంచి 35 మంది రైతులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతంతో ప్రయోజనాలు



ద్రవ జీవామృతం తయారీ చేసి చూపిస్తున్న ఎన్‌పీఎం సిబ్బంది

భామిని: ద్రవ జీవామృతంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని ఎన్‌పీఎం మాస్టర్ ట్రైనీ మోటక అంబోజీ, ఐసీఆర్‌పీ వలరౌతు ప్రభాకర్ అన్నారు. మండలంలోని నులకజోడులో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రవజీవామృతం తయారు చేయడంతో పాటు వాటి వల్ల కలిగే లాభాలను వివరించారు. ఐసీఆర్‌పీలు సంధ్య, జి.మురళి, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



గొట్టివలసలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈఓపీఆర్‌డీ

గరుగుబిల్లి: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని గొట్టివలస సర్పంచ్ బి.చంద్రినాయుడు అన్నారు. మండలంలోని స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ గురువారం చేశారు. గొట్టివలస పంచాయతీ కార్యాలయం వద్ద ఈఓపీఆర్‌డీ గోపాలరావు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌కు దారేది..?



అధ్వానంగా ఉన్న ప్రస్తుత రహదారి

సీతంపేట: స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌కు పక్కా రహదారి లేదు. ఇక్కడ నుంచి రేషన్‌డిపోలకు బియ్యం, ఇతర రేషన్ సరుకులు సరఫరా చేస్తారు. ఈ గోదాంనకు వెళ్లే మార్గంలో నీరు నిల్వ ఉండి బురదగా మారడంతో లారీలు, వ్యాన్, తదితర వాహనాల రాకపోకలకు ఇబ్బందులేర్పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

23లోగా ' ఈ పంట' నమోదు

భామిని: మండలంలోని రైతులందరూ తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ నెల 23లోగా ఈ పంటలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం అన్నారు. మండలంలోని అనంతగిరి, దిమ్మిడిజోల గ్రామాల్లో గురువారం పర్యటించి ఈ పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే 14,600 ఎకరాల పంట నమోదు జరిగిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

పాలకొండ: మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రయోగమూర్తి స్పష్టం చేశారు. పట్టణంలోని ఏలాం సెంటర్ వద్ద గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనచోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. చిన్నారులకు వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

